
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





# అమెరికులాసా కథ – 211

# మెడల్ మార్పిడి- దేశ దోపిడి కథ

మొన్నీ మధ్య మా అమెరికా అధ్యక్షుడు డానల్డ్ ట్రంప్ గారికి 'నోబెల్ బహుమానం" ఇచ్చినట్టు--అవును...ఇచ్చినట్టే కానీ వచ్చినట్టు కాదు...అనేది వార్తలలో చూసి అనాలోచితంగా వీపు గోక్కున్నాను. ఎందుకంటే ఈ తతంగం అంతా 'ఇచ్చుకో, పుచ్చుకో" అనే 'పరస్పర వీపు గోకుడు' ధోరణిలోనే జరిగింది అని నాకు అనిపించింది. దీనికి నేపథ్యం అందరికీ తెలిసినదే.  అప్పటికి కొద్ది రోజుల ముందే ముఠా మేస్త్రీ ట్రంప్ గారు ఒకానొక అర్ధరాత్రి పూట తన సైన్యాన్ని పంపించి తన దేశ రాజ భవనంలో హాయిగా నిద్ర పోతున్న వెనెజ్యులా అధ్యక్షుడు అయిన నికలస్ మడూరో నీ, ఆయన అర్ధాంగినీ నిర్బంధించి "అక్రమ మందుల అక్రమ సరఫరా" అనే డ్రగ్ ట్రాఫికింగ్ నేరానికి విచారణ వంకతో న్యూయార్క్ కి తరలించారు. ఈ తరహా రాజకీయ, యుద్ధ వ్యూహాన్ని "ఆక్యుపేషనల్ థెరపీ" అన వచ్చు. అనగా "రాజ్యాన్ని మొత్తం ఆక్యుపై చేసి...అనగా కబళించి రోగం కుదర్చడం" అన మాట. పూర్వం రోజుల్లో అలెక్జాండరూ, చెంఘీజ్ ఖానూ, ఔరంగ జేబూ లాంటి వారు కూడా తమ బల పరాక్రమాలని ఉపయోగించి ఇతర రాజ్యాలని ఇలాగే ఆక్రమించుకునే వారు కదా. ఇక తన ప్రత్యర్థి అమెరికాలో జైలుకి పోయిన సంతోషం పట్ట లేక "మా వెనిజ్యులా మీద అర్ధరాత్రి పూట దాడి చేసి దేశ విముక్తి చేసినందుకు" అ దేశ ప్రతి పక్ష నాయకురాలు అయిన మరీనా కొరీనా మకాడో అనే ఆవిడ గత ఏడాది 2025 లో తనకి నిఝంగానే వచ్చిన నోబెల్ శాంతి బహుమతిని వైట్ హౌస్ లో ట్రంప్ గారికి బహూకరించారు అనేదే నేను చూసిన వార్త. నాలాగే ఆ వార్త టీవీలో చూసి తెలుసుకున్న అసలు సిసలు నోబెల్ కమిటీ వారు ఏడవాలో, నవ్వాలో తెలియక మూకుమ్మడిగా ఇంగ్లీషులో లబో దిబో మని "అలా మెడల్ మార్పిడికి మేము సుతరామూ ఒప్పుకోము" అనేసి చేసేది ఏమీ లేక చేతులు దులిపేసుకున్నారు.

ఇక్కడ నాకు వచ్చిన మరొక అనుమానం ఏమిటంటే....సదరు మకాడో మహిళ గారికి నోబెల్ వారు శాంతి బహుమాన పతకమూ, చెక్క ముక్కతో పాటు సుమారు పదకొండు మిలియన్ల స్వీడన్ క్రోనర్ కరెన్సీ అనగా సుమారు ఒక 1.25 మిలియన్ అమెరికన్ డాలర్ల చెక్కు అనగా...అమరావతిలో కృష్ణానది ఒడ్డున మూడు పడక గదుల ఫ్లాట్ కి సరిపడా

నగదు బహుమతి కూడా ఇచ్చారు కదా....మరి ఆవిడ ఆ చెక్కు కూడా ట్రంప్ గారికి ఇచ్చిందా లేక ట్రంప్ గారే లోపాయికారీగా ఆవిడకి మరి కొన్ని మిలియన్లు ముట్టజెప్పి మెడల్ మార్పిడి చేయించారా అనేది నా 'దురానుమానం". దురానుమానం అంటే దురభిప్రాయముతో కూడిన అనుమానమూ, లేదా శంక అనమాట. అనుమానాలలోనే మంచి అనుమానాలూ, చెడ్డ అనుమానాలూ ఉంటాయి కదా. కన్నాంబకి వచ్చిన మంచి అనుమానం సూర్యాకాంతానికి చెడ్డగానూ, రాజనాల దుర్మార్గపు అనుమానం అక్కినేనికి అస్సలు డౌటే లేని విషయం గానూ ఎన్ని సినిమాలలో మనం చూడ లేదూ?

ఇక్కడ మరొక పిట్ట కథ ఏమిటంటే ...ఈ మెడల్ మార్పిడి కి ముందు ట్రంప్ గారి మెదడు మకాడో మీద వ్యతిరేకంగా పని చేసేది. ఉదాహరణకి ట్రంప్ గారు మదూరో అబ్బాయిని పట్టుకుని న్యూయార్క్ జైలులో పెట్టగానే విలేఖర్లు "ఇప్పుడు మకాడో అమ్మాయిని వెనెజ్యులా దేశానికి అధ్యక్షురాలిని చేస్తారా?" అని అడిగితే ఆయన మ.మ అనో ఏమో అనడానికి బదులు "మకాడో అమ్మాయికి నోబెల్ వచ్చినా ఆ దేశంలో ఆమెకి గౌరవం లేదు. ఆవిడ మాటలని ఎవరూ ఖాతరు చెయ్యరు. అంచేత అదేమీ కుదరదు" అని స్పష్టంగానే ప్రకటించిన ట్రంప్ గారు ఈ నోబెల్ చెక్క ముక్క మార్పిడి అవగానే మెదడు మార్పిడికి లోనై "మకాడో ఆవిడ భలే మంచి ఆవిడ" అని ప్లేటు మార్చేశారు. "ఒపినియన్స్ మారిస్తే కానీ పొలిటీషియన్ అవనేరడోయ్, వెంకటేశం" అని మన గిరీశం ఏనాడో శలవిచ్చాడూ కదా! దాన్ని ట్రంప్ గారు అక్షరాలా పాటిస్తారు. అంచేత ఇప్పుడు దొడ్డి దారిన దక్కిన ఈ నోబెల్ బహుమానం ధర్మమా అని ఆవిడ అతి త్వరలోనే ఆ దేశానికి అధ్యక్షురాలు అయినా, కాకపోయినా వెనెజ్యులా మీద ఈ దాడి జరగ్గానే టక్కున ముక్కున వేలు వేసుకుని కత్తులు దూసుకుని రెడీ అవడమో, సూట్ కేసులు సద్దుకుని పారిపోవడానికి సిద్ధపడడమో చేసే వాళ్ళు కనీసం ముగ్గురున్నారు.

ఆ ముగ్గురిలో మొదట ముక్కున వేలు వేసుకునేది గ్రీన్ లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడెరిక్ నియెల్సన్ అనే ఆయన. ఎందుకంటే వెనెజ్యులా లాగా చమురు నిలవలు, సహజ వాయువే కాక అమెరికాకి కావలసిన ఇతర సహజ వనరులు కూడా పుష్కలంగా ఉన్న గ్రీన్ లాండ్ మీద ట్రంప్ గారి కన్ను ఎప్పుడో పడింది. పైగా నియెల్సన్ గారు డెమొక్రాట్ కూడా. అంచేత ట్రంప్ గారు దాడి చెయ్యడానికి అన్ని "అర్హతలూ" ఆయనకి ఉన్నాయి. కానీ ఇక్కడ ఒక చిక్కు ముడి ఉంది. అదే 'అమెరికంచే చేను మేయుట". మా కాకినాడ గాంధీ నగరంలో కంటే తక్కువగా, గట్టిగా లెక్క పెడితే అరవై వేల మంది మాత్రమే జనాభా ఉన్న గ్రీన్ లాండ్ ఉత్తర అమెరికా ఖండం లోనే ఉన్న ఒక భౌగోళిక ప్రాంతమే అయినా అది ఒక స్వతంత్ర దేశం కాదు. ఎక్కడో దూరంగా ఐరోపా ఖండంలో ఉన్న డెన్మార్క్ దేశంలో ఈ గ్రీన్ లాండ్ స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక అంతర్భాగం. మరి డెన్మార్క్, అమెరికా మరొక 70 పైగా ఐరోపా దేశాలు నాటో (North Atlantic Treaty Organization) సంస్థలో భాగస్వాములు. వాళ్ళలో వాళ్ళ ఒప్పందం ప్రకారం ఆయా దేశాలు ఒకరి మీద

మరొకరు దాడి చేసుకోకూడదు. మరి ఇప్పుడు ట్రంప్ గారు ఏదో వంక పెట్టి గ్రీన్ లాండ్ ప్రత్యక్షంగా..అనగా డెన్మార్క్ మీద పరోక్షంగా దాడి చేస్తే అమెరికంచె చేను మేసినట్టే కదా! కండ బలం ఉన్న పెద్దన్నయ్య పీలగా ఉన్న ఆఖరి తమ్ముడి కాలు విరిచేసి ఆస్తి లాగేసుకున్నట్టే కదా! అలా చేస్తే నాటో కుటుంబంలో ఉన్న మిగతా అన్నదమ్ములైన ఇంగ్లండ్, జర్మనీ, ఫ్రాన్స్ లాంటి అన్ని దేశాలూ ట్రంప్ దాడిని తిప్పికొట్టే అవకాశం ఉంది. కావడానికి రిపబ్లికన్ ట్రంప్ "ఏనుగు" బలం ఉన్నవాడే. కానీ డెమొక్రాటిక్ "గాడిద" లు ఆ దేశాలు అన్నీ కలిస్తే ఏనుగు కూడా దాడి మానేసి దౌడు తియ్యాలి కదా.(ఇక్కడ ఏనుగు, గాడిద ఆయా పార్టీ గుర్తులు అని గమనించ వలెను.). అంచేత గ్రీన్ లాండ్ పరిపాలకుడు నియెల్సన్ గారు కానీ, డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడెరిక్సన్ గారు కానీ తాము ముక్కున వేసుకున్న వేలుని తీసెయ్యవచ్చు. గ్రీన్ లాండ్ విషయంలో ట్రంప్ గారి "దాడి" ప్రకటనలు ఉట్టి తాటాకు చప్పుళ్ళే. గ్రీన్ లాండ్ విషయంలో దాడి చెయ్యకుండా దొడ్డి దారిన తనకి కావలసినది ట్రంప్ గారు సాధిస్తాడు అనే అనుకోవాలి.

ఇక వేలు పడిన రెండో ముక్కు రష్యా నియంత పుటిన్ గారిది. "అరె, దాని దుంపదెగా..ఇలా అర్ధరాత్రి మెరుపు దాడి చేసి యుక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ గారిని పెళ్ళాం పిల్లలతో సహా నిర్బంధించి రష్యా జైలులో పెట్టాలనే ఆలోచన తనకి ముందే ఎందుకు తట్టలేదు. అనవసరంగా ఈ దిక్కుమాలిన యుద్ధం లోకి దిగి తల ప్రాణం తోక లోకి ఎందుకు తెచ్చుకున్నానా" అనేదే పుటిన్ గారి ముక్కున వేలుకి కారణం. యుక్రెయిన్ దేశం నాటో లో భాగస్వామి కాదు కాబట్టే కదా అమెరికా, ఇంగ్లండ్ తదితర నాటో దేశాల యుక్రెయిన్ ని సమర్ధన పైన పటారం లోన లొటారం లా ఉంది. ఇప్పుడు పుటిన్ అలా దాడి చేసినా, చైనా తైవాన్ మీద దాడి చేసినా పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టే అవుతుంది. అంటే, ట్రంప్ గారు పెద్ద పులి అంటావా అంటే ఏమో 'నాకేం తెలుసు, నిమ్మకాయ పులుసు' అంటాను.

ఇక మూడో ముక్కున వేలు ఇరాన్ లో అయొటోలా ఆలి కొమినై గారిది. అక్కడ వేలమంది రోజుల తరబడి తిరుగుబాటు చేస్తున్న వాళ్ళని ఆయొటోలా గారు అణగదొక్కుతుంటే, ఇక్కడ ట్రంప్ గారు అదే అదను చూసుకుని దాడికి సిద్ధ పడుతున్నారు అని అందరికీ తెలిసిన రహస్యమే. ఇప్పటికే అమెరికా యుద్ధ నౌకలు ఇరాన్ సమీపం లో మధ్యధరా సముద్రానికి చేరుకుని ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాయి. ఇక్కడ అమెరికా నడిబొడ్డు మినియాపొలిస్ లో మారణకాండ ఒక కొలిక్కి వస్తున్న నేపధ్యంలో అక్కడ ఇరాన్ లో కొలిమికి నిప్పు రాజేయడం ట్రంప్ గారి దివ్యదృష్టిలో బహుశా ఒక చరిత్రాత్మక అవకాశంగా కనిపించ వచ్చు. మెరుపు దాడుల ద్వారా అటు వెనుజ్యులా లోనూ, ఇరాన్ లోనూ అమెరికా చెప్పు చేతలలో ఉండే "ప్రజా స్వామిక నియంతల పాలన" నెలకొల్పగలిగితే... పుటిన్ యుక్రెయిన్ యుద్ధం ఆపనూ వచ్చు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన వంతు 'దాడి' కి సిద్దంగా ముక్కున వేలు వేసుకోనూ వచ్చు. అలాస్కా, కెనడా, గ్రీన్ లాండ్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు....ముద్దుగా అన్నీ కలిపి ఒకే ఒక దేశం....అదీ డానల్డ్ ట్రంప్ గారి జీవిత ధ్యేయం. అది సాధించడానికి ఇంకా మూడేళ్ళు ఆయన అధ్యక్ష పదవిలో ఉంటారు. పావులు సరిగ్గా కదిపితే మరొక

నాలుగేళ్ళు కొనసాగించే అవకాశం కూడా ఉంది. ఇక మెక్సికోతో సహా మధ్య అమెరికా ఖండం అంటారా.. వద్దు కాక వద్దు ఎందుకనగా అవి బీద మొద్దు దేశాలు..ఎవరూ దూక లేని గోడ కట్టేసి వాళ్ళ దాడి నుంచి మా బృహత్ అమెరికాని కాపాడుకుంటాం. ట్రంప్ గారి అశ్వమేధ యాగంలో గుర్రాలు చాలానే ఉన్నాయి. వాటిల్లో కొన్ని ఎగరా వచ్చు. ఏమో..ఏమౌనో....టారిఫ్ గుర్రం అప్పుడప్పుడు ఎగిరి పడుతూనే ఉందిగా!

**COMMENTS**